ఏఎన్‌ఎంల కౌన్సెలింగ్‌లో అవకతవకలు

- ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఉంటేనే కోరుకున్న స్థానం
- లేకుంటే ఇష్టానుసారంగా పోస్టింగ్స్
- కౌన్సెలింగ్ షెడ్యూల్ లేదు
- ఖాళీలు చూపించలేదు
- డీఎంహెచ్‌ఓ గదిలో సీక్రెట్‌గా కౌన్సెలింగ్
- డబ్బులు చేతులు మారాయంటూ ఆరోపణలు



గుంటూరు మెడికల్: వార్డు సచివాలయ ఏఎన్‌ఎం గ్రేడ్–3ల జనరల్ బదిలీల కౌన్సెలింగ్ సిఫార్సులకే ప్రాధాన్యం దక్కింది. మూడు రోజులుగా ఇష్టానుసారంగా బదిలీల ప్రక్రియ సాగింది. షెడ్యూల్ లేకుండా, ఖాళీలు చూపించకుండా, ఒక్కో అభ్యర్థిని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కూర్చోబెట్టుకుని బదిలీలు చేపట్టారు. దీంతో ఏఎన్‌ఎంలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జూమ్ అని చెప్పి క్యాన్సిల్ చేశారు....

సచివాలయ ఏఎన్‌ఎంలకు తొలుత జూన్ 27న మ్యాన్‌వల్‌గా బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్‌ల ద్వారా డీఎంహెచ్‌ఓ కార్యాలయం అధికారులు సమాచారం పంపించారు. బదిలీ కావాలనుకునే ఐదు ప్రాంతాల పేర్లు రాసి ఇవ్వాలని చెప్పటంతో అందరూ కాగితాలపై రాసి సీనియర్ అసిస్టెంట్ ద్వారా డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పంపించారు. జూన్ 30న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పి సాయంత్రం వరకు అభ్యర్థులను ఫోన్‌ల వద్ద వేచి ఉండమని చెప్పి తీరా జూమ్ యాప్ ఓపెన్ కావటం లేదని క్యాన్సిల్ చేశారు. మళ్లీ జూలై 3న కౌన్సెలింగ్ చేస్తామని డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి రావాలని పిలిపించారు.

ఫోన్ చేసి పిలిస్తేనే కౌన్సెలింగ్‌కు రావాలి....

ఎవరికైతే డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి ఫోన్ చేసి పిలుస్తారో వారు మాత్రమే కౌన్సెలింగ్ రావాలని కొత్త ప్రక్రియకు అధికారులు తెరదీశారు. కొంత మందికి ఫోన్‌లు వచ్చాయని, వారికి మాత్రమే నచ్చిన చోట బదిలీ చేశారని, ఫోన్‌లు రాని వారికి తీవ్ర అన్యాయం జరిగిందని ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫోన్ చేసిన అభ్యర్థిని డీఎంహెచ్‌ఓ చాంబర్‌లో కూర్చోబెట్టి కార్యాలయ అధికారులు, ఉద్యోగులు కూర్చుని కొత్త తరహా కౌన్సెలింగ్ చేశారని, ఇప్పటి వరకు వైద్య ఆరోగ్యశాఖ చరిత్రలో ఇలాంటి ట్రాన్స్‌ఫర్స్ కౌన్సెలింగ్ జరగలేదని పలువురు వాపోయారు.

ఎమ్మెల్యే లేఖ ఉంటేనే....

ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ కావాలనుకునే వారు తాము నచ్చిన ప్రాంతం తమకు దక్కాలంటే ఎమ్మెల్యే లేఖ తప్పనిసరిగా ఉండాలి. ఎమ్మెల్యే లేఖ ఇచ్చిన వారికి మాత్రమే వారు కోరుకున్న ప్రాంతాల్లో బదిలీ చేశారు. లేఖ లేనివారికి తాము ఇచ్చిన ఐదు ఆప్షన్లు కూడా ఖాళీగా లేవని చెప్పి వైద్యాధికారులు తమకు తెలియని, తాము కోరుకోని కొత్త ప్రాంతంలో పోస్టింగ్స్ ఇచ్చి ఉద్యోగంలో చేరాలని ఆదేశించారు. అభ్యర్థులకు తాము ఇచ్చిన ఐదు ఆప్షన్లు ఖాళీగా లేకపోతే కనీసం ఎక్కడ ఖాళీలు ఉన్నాయో కూడా చెప్పకుండా అధికారులే ఒక ప్రాంతాన్ని ఎంపికచేసి బదిలీ ఆర్డర్స్ ఇవ్వటం పూర్తి అధికార దుర్వినియోగమేనని పలువురు ఆరోపిస్తున్నారు.

ఖాళీలు చూపించకుండానే...

సాధారణ బదిలీలు(జనరల్ ట్రాన్స్‌ఫర్స్) సమయంలో తొలుత ఏఏ ప్రాంతాలు ఖాళీగా ఉన్నాయో జాబితాను విడుదల చేయాలి. అభ్యర్థులకు ఖాళీ పోస్టుల వివరాలు తెలియజేసి వారు వాటిని ఎంచుకునే అవకాశం ఇవ్వాలి. ఏ రోజు కౌన్సెలింగ్ చేస్తారో ముందుగానే మీడియా ద్వారా సమాచారం అందించాలి. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పైన పేర్కొన్న ఏ ఒక్కటి జరగలేదు. అంతా వాట్సప్ ద్వారానే కథ నడిపించారు. ముడుపులు భారీ స్థాయిలో చేతులు మారాయని, అందువల్లే చాలా సీక్రెట్‌గా డీఎంహెచ్‌ఓ చాంబర్‌లో ఒక్కో అభ్యర్థికి ప్రత్యేకంగా బదిలీ కౌన్సెలింగ్ చేశారని పలువురు ఏఎన్‌ఎంలు వాపోవుతున్నారు. పూర్తిగా నిబంధనలు ఉల్లఘించి నిర్వహించిన జనరల్ ట్రాన్స్‌ఫర్స్ కౌన్సెలింగ్‌ను రద్దు చేసి తిరిగి నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్ చేయాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

డ్రెయిన్లలో పూడికతీత పనులు పక్కాగా జరగాలి



మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు


నెహ్రూనగర్: నగరంలో చేపట్టిన మేజర్, మైనర్ డ్రెయిన్లలో చేపట్టిన పూడికతీత పనులు పక్కాగా జరగాలని, పనులకు ముందు, అనంతరం ఫోటోలతో రిపోర్ట్ ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మేజర్, మైనర్ డ్రెయిన్ల పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టి సారించామని, రానున్న వర్షాకాలంలో ఎక్కడైనా రోడ్లు, డ్రెయిన్లలో నీరు వెళ్లకుండా రోడ్ల మీద నిలిస్తే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. డ్రెయిన్ల ఆక్రమణలు తొలగించిన తర్వాతనే పూడికతీత చేపట్టాలని, ప్రతి డ్రెయిన్‌లో నూరు శాతం పూడికతీసి, స్థానికులతో సంతకాలు చేయించాలని కోరారు. పట్టణ ప్రణాళిక అధికారులు తొలుత మేజర్ డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించుకోవాలని నోటీసులు ఇచ్చి, మూడు రోజుల అనంతరం ఆక్రమణలను సంపూర్ణంగా తొలగించాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. డ్రెయిన్‌కి ముందు ఏమి ఉండడానికి వీలు లేదని, ఆయా ప్రాంతాల్లో మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకోవాలని ఏడీహెచ్‌ని కోరారు. నగరంలోని అన్ని డ్రెయిన్ కల్వర్టుల వద్ద మెష్‌లు ఏర్పాటు చేయాలని ఏఈలను ఆదేశించారు. రెడ్డిపాలెం రోడ్ విస్తరణ పనులను ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో చేపట్టాలని చెప్పారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో టెండర్ పొంది అగ్రిమెంట్ చేసుకోని వర్క్స్‌ని రద్దు చేయాలని, 2024–25 ఆర్థిక సంవత్సరంలో టెండర్ పొంది, పనులు ప్రారంభించని వాటిని, అగ్రిమెంట్ పొంది ఫీల్డ్‌లో కొంత మేర చేపట్టి, నిలుపుదల చేసిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చి రద్దు చేయాలని చెప్పారు. అధిక ప్రాధాన్యం కలిగిన పనులను వేగంగా చేపట్టడానికి ఈఈలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ఏఈ కార్యాలయాల్లో ఉన్న ఆపరేటర్లు సోమవారం నుంచి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కేంద్రంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈకి సూచించారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల గుర్తింపు..

నెహ్రూనగర్: వీధి వ్యాపారుల గుర్తింపు సర్వే నిర్దేశిత ప్రమాణాల మేరకే జరగాలని, కార్యదర్శులు పూర్తి చేసిన సర్వేని క్షేత్ర స్థాయిలో ప్రత్యేక బృందాల ద్వారా పునః పరిశీలన చేయిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శనివారం కౌన్సిల్ సమావేశ మందిరంలో వీధి వ్యాపారుల సర్వేపై, నగరంలో మిషన్ గ్రీన్ అమలుపై నోడల్ అధికారులతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో వార్డుల వారీగా సచివాలయాల వారీగా వీధి వ్యాపారుల గుర్తింపు సర్వేను వేగవంతం చేయాలని నోడల్ అధికారులను ఆదేశించారు. నగరంలో మిషన్ గ్రీన్ అమలులో భాగంగా నగరంలో 5 లక్షల మొక్కలను నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, పీఓ రామారావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్యకు నోటీసులు

- స్థలం ఆక్రమణ ఫిర్యాదుపై స్పందించిన కార్పొరేషన్ కమిషనర్
- డాక్యుమెంట్స్‌ను కమిషనర్ వద్ద పొందుపరచాలని నోటీసులు



మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, గుమ్మడి భారతికి కమిషనర్ ఇచ్చిన నోటీసులు

నెహ్రూనగర్: మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య జీటీ రోడ్డులో(మిర్చి యార్డు) ఉన్న నా స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని శారదా కాలనీకి చెందిన గుమ్మడి భారతి ఏప్రిల్ 2వ తేదిన పీజీఆర్ఎస్‌లో నగర కమిషనర్, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు ఆధారంగా నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆస్తి హక్కుకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను తీసుకుని ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటలకు కమిషనర్ చాంబర్‌లో కమిషనర్‌కు చూపించాలని కిలారి రోశయ్యకు, అదే విధంగా గుమ్మడి భారతిలకు శనివారం నోటీసులు జారీ చేశారు.

వివాదం ఏమంటే...

గుంటూరు జీటీ రోడ్డు(మిర్చియార్డు)లోని 1.23 సెంట్లు స్థలాన్ని 1980లో ఓ వ్యక్తి నుంచి వద్ద నుంచి గుమ్మడి భారతి భర్త రాజారావుతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు కలసి స్వాధీన అగ్రిమెంట్ కింద(ముగ్గురు మూడు భాగాలుగా తీసుకున్నారు) కొనుగోలు చేశారు. అయితే సదరు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయకుండా స్థలం అమ్మిన వ్యక్తి 1981లో తన అనుచురులతో కలిసి కావాలనే కోర్టులో వ్యాజ్యం వేయించి సదరు స్థలాన్ని అప్పు కింద అటాచ్ చేసి ఇవ్వాలని కోర్టును ఆశ్రయించాడు. 1999 వరకు కోర్టులో వాదనలు జరుగుతూ వస్తున్న క్రమంలోనే 1989, 91, 94వ సంవత్సరాల్లో స్థలం అమ్మిన వ్యక్తే మాజీ ఎమ్మెల్యే తాలుకా వ్యక్తులకు జీపీఏ(జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) చేశాడు. గుమ్మడి రాజారావుతో కలసి ఉన్న ఇద్దరు వ్యక్తులు కూడా ఎమ్మెల్యేకు సపోర్ట్‌గా స్థలం అప్పగించేందుకు కంకణం కట్టుకోవడంతో 1.23 సెంట్ల స్థలంలో 2015లో ముందు భాగంలో ఒక థియేటర్, వెనుక భాగంలో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. మధ్యలో ఉన్న రాజారావు స్థలాన్ని అలాగే ఖాళీగా వదిలేశారు. సదరు స్థలాన్ని రాసివ్వాలని పలు మార్లు బెదిరించినా రాజారావు స్పందించకపోవడంతో కారుతో గుద్దించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. గత సంవత్సరం అనారోగ్యం కారణంగా రాజారావు మరణించడంతో ఇంకా ఎవరు అడ్డు లేరులో అని సదరు స్థలంలో నిర్మాణం ప్రారంభించారని ఆరోపించారు. దీనిపై నగర కమిషనర్‌కు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశానని గుమ్మడి భారతి చెప్పారు. సదరు ఫిర్యాదు ఆధారంగా శనివారం నోటీసులు జారీ చేశారు. నగరపాలక సంస్థ అధికారులు. ఇద్దరు డాక్యుమెంట్స్ పరిశీలించిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్యామల కోటిరెడ్డి

నెహ్రూనగర్: నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా గుంటూరు జిల్లా రావెల గ్రామానికి చెందిన డాక్టర్ శ్యామల జయకోటిరెడ్డిని నియమిస్తూ కమిటీ నేషనల్ చైర్మన్ మహమ్మద్ యాసీన్ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన శ్యామల జయకోటిరెడ్డి మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ కోసం తన వంతు తగిన కృషి చేస్తానని చెప్పారు.

నేడు ఉచిత వైద్యశిబిరం



గుంటూరు మెడికల్: సామాన్య, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే ముఖ్య ఉద్దేశంతో ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. శనివారం స్థానిక నాజ్‌సెంటర్‌లోని హాస్పిటల్‌లో మీడియా సమావేశం నిర్వహించి, వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గోరంట్ల రామాలయం గుడివద్ద ఉన్న పి.హెచ్.సి సెంటర్‌లో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, డాక్టర్ అన్వేష్ కుమార్, డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

సంక్షేమ బాంధవుడు వైఎస్సార్



ఆర్కే రోజా (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళలకు సంక్షేమం, భద్రత, గౌరవం కల్పిస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకున్న జనం చెక్కిన శిల్పం డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అని మాజీ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. గుంటూరులోని అవర్ స్టేట్ అవర్ లీడర్ – ఇంటిలెక్చ్యువల్ ఫోరం అధ్యక్షుడు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతి వారోత్సవాల్లో భాగంగా గొప్ప జ్ఞాపకాలు శీర్షికన సంక్షేమ బాంధవుడు వైఎస్సార్ అనే అంశంపై శనివారం వెబినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్కే రోజా మాట్లాడుతూ వైఎస్సార్ గుడిసెలు లేని గ్రామాలను, మురికి వాడలు లేని పట్టణాలను, నగరాలుగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చాలని కృషి చేశారని అన్నారు. సమగ్ర గృహ నిర్మాణం మురికివాడల అభివృద్ధి పథకాన్ని రాష్ట్రం సద్వినియోగం చేసుకుని అందరికీ సుందరమైన గృహాలు నిర్మించారన్నారు. జవహర్ లాల్ నెహ్రూ పట్టణాభివృద్ధి మిషన్ ద్వారా రూ.12,523 కోట్లను మంజూరు చేయించడంతో పాటు రూ.1.544 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులను కలుపుకుని పేదల సమగ్రాభివృద్ధి పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి శ్వాసగా, ధ్యాసగా ఆయన పని చేశారని వివరించారు. హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టుకు కేంద్రం ఆర్థిక సహాయం అందించిందని, డ్వాక్రా సంఘాలకు రూ.20వేల కోట్ల నిధులను కేటాయించారని తెలిపారు. ముఖ్యమంత్రుల్లో మేలిరత్నంగా డాక్టర్ వైఎస్సార్ ఉన్నారని కొనియాడారు. అగ్రికల్చరల్ మిషన్ పూర్వ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టుల ద్వారా రాజధానికి గోదావరి జలాలు తరలించేందుకు హైదరాబాద్ సుజల స్రవంతికి రూ.3,375 కోట్లు, కృష్ణా జలాలను నగరాలకు తరలించేందుకు రూ.1.082 కోట్లు మంజూరు చేశారని వివరించారు. వెబినార్‌లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశ, విదేశాల్లోని తెలుగు ప్రజలు, ప్రముఖులు పాల్గొన్నారు.

చంద్రమౌళినగర్ పోస్టాఫీసు ఎదుట పోస్ట్‌మెన్‌ల ధర్నా



పోస్టల్ సూపరిటెండెంట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పోస్ట్‌మెన్‌లు

లక్ష్మీపురం: ఆదివారం కూడా పోస్ట్‌మెన్‌లను ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాల్సిందిగా డివిజన్ పోస్టల్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో పోస్ట్‌మెన్‌లు శనివారం రాత్రి ధర్నాకు దిగారు. గుంటూరు చంద్ర మౌళినగర్ పోస్టల్ సూపరిటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆదివారాలు కూడా పనిచేసే విధంగా ఐడీసీ(ఇంటిగ్రేటెడ్ డెలవరి సెంటర్‌ను) కొత్తపేటలో ఏర్పాటు చేశారు. కొత్తపేట పోస్టాఫీసు ఐడీసీ పరిధిలో కొత్తపేట, గుంటూరు కలెక్టరేట్ పోస్టాఫీసు, గుంటూరు బజార్ పోస్టాఫీసులలో విధులు నిర్వహించి సుమారు 60 మంది పోస్ట్‌మెన్‌లు, ఉమెన్‌లు ఉన్నారు. అయితే ఐడీసీ నిబంధనల ప్రకారం ఆదివారం కూడా విధులు నిర్వహించాలన్న విషయాన్ని పోస్టల్ ఉన్నతాధికారులు ముందుగా పోస్ట్‌మెన్‌లకు సమాచారం ఇవ్వలేదు. ఆదివారం మొహర్రం, తొలి ఏకాదశి కావడంతో ఆదివారం కూడా విధులు నిర్వహించాల్సిందిగా శనివారం సాయంత్రం పోస్ట్‌మెన్‌లకు చెప్పడంతో ఒక్కసారిగా పోస్ట్‌మెన్‌లు చంద్రమౌళి నగర్ వద్ద ధర్నాకు దిగారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



విద్యుత్ మీటర్ పగలగొట్టి నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

లక్ష్మీపురం: ప్రజలపై భారం వేసే విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పార్టీ గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో గుంటూరు లిబర్టీ థియేటర్ వద్ద విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. స్మార్ట్ మీటర్ను పగులకొట్టి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ భారతదేశ రాజకీయాలలో అంబానీ, అదానీలు శని గ్రహాల్లా తయారయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో బీజేపీకి అదృష్టం కలిసి వచ్చే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని, బీజేపీ అధికారంలో ఉన్న యూపీ వంటి రాష్ట్రాలతో పోల్చుకుంటే నూటికి నూరు శాతం బీజేపీ రాజకీయ లబ్ధి పొందుతున్న రాష్ట్రంగా కూడా ఆంధ్రప్రదేశ్ ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు సరైన ఆలోచన చేయాలని, అలా కాకుండా గాలిలో మేడలు కడితే ప్రజలు ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, రాష్ట్ర సమితి సభ్యులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు మేడా హనుమంతరావు, నగర కమిటీ సభ్యులు రావుల అంజిబాబు, ఆకిటి అరుణ్ కుమార్, మంగా శ్రీనివాసరావు, షేక్ వలి, జంగాల చైతన్య పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక చేయూత



నగరంపాలెం: సహచర కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికంగా చేయూతనివ్వడం అభినందనీయమని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో కానిస్టేబుల్ కె.క్రాంతికుమార్ మృతిచెందారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా (2012 బ్యాచ్) కానిస్టేబుళ్లు సేకరించిన రూ.1.35 లక్షలు శనివారం క్రాంతి కుమార్ కుటుంబ సభ్యులకు జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అందించారు. కానిస్టేబుల్ కుటుంబానికి పోలీస్ శాఖ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ, 2012 బ్యాచ్ ఏఆర్ కానిస్టేబుళ్లు పి.హరిబాబు, సత్యనారాయణ, శేఖర్, జగదీష్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు



శిక్షణ పొందిన మహిళలతో ఏఎన్‌యూ వీసీ

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. ఏఎన్‌యూ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగం ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని వావిలాల గోపాలకృష్ణయ్య సంస్థలో సేవాభారతి విభాగం ద్వారా కుట్టుమిషన్ శిక్షణ పొందుతున్న మహిళలకు కుట్టుమిషన్ మరమ్మతులపై శనివారం ఒక్కరోజు ఉచిత శిక్షణ కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్షతకు తావు లేదని చెప్పారు. సేవా భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేఏస్ఎన్ చారి మాట్లాడారు. అనంతరం శిక్షణ పొందిన 40 మంది మహిళలకు వీసీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బి.బబిత, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎంవీ రమణ, సేవా భారతి జిల్లా కార్యదర్శి జాగు శ్రీనివాస్, శిక్షకుడు షేక్ కరీముల్లా, ఎస్.శ్యామల పాల్గొన్నారు.

సీబీఎస్ఈ పాఠశాలల ప్రిన్సిపాళ్లకు శిక్షణ తరగతులు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్స్

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల వేదికగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని సీబీఎస్ఈ పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్‌కు జాతీయ నూతన విద్యా విధానం–2020పై రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియట్ ట్రైనింగ్ అండ్ మేనేజ్ మెంట్ (ఐఎస్‌టీఎం), కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ) సభ్యులతో కలిసి సీబీఎస్ఈ బోర్డు ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (టీఓటీ) సర్టిఫికేషన్ కోర్సు నిర్వహించారు. జాతీయ నూతన విద్యావిధానం ఫ్రేంవర్క్ ఆధారంగా ఉపాధ్యాయులకు సీబీఎస్ఈ రిసోర్స్ పర్సన్లుగా పని చేసేందుకు టీఓటీ కోర్సు ఉపయోగపడుతుందని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. వర్క్‌షాప్ నిర్వహణ ప్రతినిధులుగా ప్రమోద్ కుమార్ జైస్వాల్, డాక్టర్ సజీవ్, డాక్టర్ సునీర్ నాగి దీప వ్యవహరించారు.

కానిస్టేబుల్‌పై దౌర్జన్యం

పట్నంబజారు: ట్రాఫిక్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్ పరిధిలోని సీహెచ్ వెంకటేశ్వరరావు కానిస్టేబుల్ విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఎత్తురోడ్డు సెంటర్ వద్ద తన విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పంచపాల శ్రీకాంత్ అనే వ్యక్తి తన మోటార్ సైకిల్‌పై వచ్చి వేరే వారితో గొడవ పడుతున్న సమయంలో సర్దిచెప్పేందుకు వెళ్లిన కానిస్టేబుల్ వెంకటేశ్వరరావుపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేస్తున్నారు.

సంపూర్ణ శ్రీకృష్ణతత్వంపై అవగాహన



నగరంపాలెం: సంపూర్ణ శ్రీకృష్ణతత్వాన్ని తెలియజేసేది శ్రీమద్ భాగవతం అని ప్రవచన ప్రబోధిని మంచికంటి వెంకటసత్యవతి అన్నారు. బ్రాడీపేట 2/13వ అడ్డరోడ్డులోని ఓంకార క్షేత్రం ఆలయ ప్రాంగణంలో శ్రీమద్ భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞ మహోత్సవం శనివారం రెండో రోజు కొనసాగింది. ఆలయ కమిటీ అధ్యక్షులు మల్లాది వెంకట కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈనెల 11 వరకు భాగవత సప్తాహ ప్రవచన జ్ఞానయజ్ఞం కొనసాగుతుందని అన్నారు. 12వ తేదీన శ్రీరుక్మిణి శ్రీకృష్ణుల కళ్యాణం, పూర్ణాహుతి అనంతరం భక్తులకు అన్న సమా రాధన నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఘంటసాల వీరకుమార్, కార్యదర్శి ఎన్‌వీఎస్.నారాయణమూర్తి, సభ్యులు టి.బాలాజీశ్రీనివాస్, బి.సుబ్బారావు, ఎం.నరసింహమూర్తి, జి.శివరావు, జి సాయికృష్ణశ్రీనివాస్, సి.రామకృష్ణశాస్త్రి పాల్గొన్నారు.

సాయినాథునికి లక్ష మల్లెల అర్చన



నగరంపాలెం: స్థానిక విద్యానగర్ మూడో వీధిలోని శ్రీసాయినాథ సన్నిధానంలో గురుపూర్ణిమ ఉత్సవ వేడుకలు శనివారం రెండో రోజుకు చేరాయి. ఉదయం సాయినాథునికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష మల్లెల అర్చన వైభవంగా జరిగింది. సాయినాథునికి మల్లెపూలను వస్త్రంగా అలంకరించారు. మహిళా భక్తులు మల్లెపూలతో స్వామిని పూజించారు. పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది భక్తులు సాయినాథుని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు యడ్లపాటి అశోక్‌కుమార్, అధ్యక్షులు వడ్లమూడి శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ నాట్యాచార్యుడు, వేదాంతం సత్యనరసింహశాస్త్రి శిష్య బృందం సాయిశరణ్య శ్రీవైష్ణవి, శ్రీజావైష్ణవిలు వినాయక కౌతంతో ప్రారంభించారు. ఎ.వి.బ్రహ్మజి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

క్యాన్సర్‌కు ఆధునిక చికిత్స



గుంటూరు మెడికల్: క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ప్రాథమిక దశలోనే వ్యాధులను త్వరగా గుర్తించవచ్చని ఐవీఎఫ్ స్పెషలిస్ట్, అహల్య ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. స్థానిక సంజీవయ్య నగర్ డాక్టర్ పినపాటి ప్రభుదాస్ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో క్యాన్సర్, డ్రగ్స్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఎక్కువగా మహిళలే క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారని చెప్పారు. మహిళలు క్యాన్సర్ బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, క్యాన్సర్ వచ్చిన వారిని దాన్ని ఎలా అధిగమించాలి అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ వలన జీవితాలు పాడవుతాయని, వాటి వలన కలిగే నష్టాల గురించి వివరించి వాటికి దూరంగా ఉండాలని సూచించారు.

ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణ్‌కుమార్



నెహ్రూనగర్: గుంటూరు జిల్లా మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్(ఎంఈఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా చెట్టిపోగు లక్ష్మణ్‌కుమార్‌మాదిగ ఎన్నికయ్యారు. శనివారం రాజాగారితోటలోని ఎమ్మార్పీస్ కార్యాలయంలో మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షుడు ఆచార్య చిలుమూరు శ్రీనివాసరావు మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు హాజరయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మన్నవ రవికుమార్‌మాదిగ, సహాయ కార్యదర్శిగా ఒంగోలు పిచ్చయ్యమాదిగ, కోశాధికారిగా శిఖా పాపారావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బందెల రవికుమార్, తాళ్లూరి మోషే, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎర్రబాబు, కార్యవర్గ సభ్యులుగా కె.కోటేశ్వరరావు, ప్రేమ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

ప్రతిభా అవార్డులు అభినందనీయం



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతిభా అవార్డులు అందుకోవడం కృషి, పట్టుదలకు నిదర్శనమని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా(ఐసీఎస్ఐ) అమరావతి చాప్టర్ చైర్మన్ ఎన్వీఎస్ నాగరాజు పేర్కొన్నారు. ఏఎన్‌యూ ఇటీవల ప్రకటించిన ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల ప్రథమ సెమిస్టర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులకు శనివారం నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగరాజు మాట్లాడుతూ ప్రతిభతో పురస్కారాలు పొందిన విద్యార్థుల అందుకున్నది కేవలం ఒక ప్రశంసాపత్రం కాదని, అది చదువులో చూపించిన కృషి, పట్టుదల. నిబద్ధతకు గుర్తింపు అని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీ రమణ మాట్లాడారు. ప్రముఖ మానసికశాస్త్ర నిపుణురాలు డాక్టర్ టీడీ విమల తన భర్త ఆచార్య చల్లా సత్యనారాయణమూర్తి పేరుతో స్మారక ప్రోత్సాహక బహుమతులు అందించారని తెలిపారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డి.కళ్యాణి, సహాయాచార్యులు సీహెచ్ వైష్ణవి, షేక్ షబానా పర్వీన్ పాల్గొన్నారు.